కొంచెం ఉత్సాహం.. కొంచెం 'టెన్'షన్



ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం

ముషీరాబాద్: ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో సోమవారం ఉదయం 9.30 గంటలకు 10వ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఒక గంట ముందు నుంచే విద్యార్థులు పరీక్షాకేంద్రాలకు తమ తల్లిదండ్రులతో కలిసి వచ్చారు. మండల పరిధిలో 23 పరీక్షాకేంద్రాలలో 4,878 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 12 మంది గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో...

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో 26 పరీక్షాకేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్ష రాశారు. మొత్తం 4,885 మంది పరీక్షలకు సిద్ధమవ్వగా 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



ముషీరాబాద్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

తొలిరోజు కావడంతో ఆయా పరీక్షాకేంద్రాలలో సందడి నెలకొంది. 9 గంటలకు ప్రశ్నపత్రం ఇవ్వాల్సిన ఇన్విజిలేటర్లు గంట శబ్దం వినపడలేదని ఆలస్యంగా ప్రశ్నపత్రం ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు సమయాన్ని గుర్తు చేయాల్సిన విషయాన్ని కొందరు ఇన్విజిలేటర్లు విస్మరించారని పలువురు విద్యార్థులు వాపోయారు.



అంబర్‌పేట్‌లోని పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

'ఎరుకల' పాలకమండలి ఏర్పాటు చేయాలి



మధుయాష్కిని కలిసిన సుల్తాన్ యాదగిరి తదితరులు

కాచిగూడ: ఎరుకల కార్పొరేషన్ పాలకమండలిని వెంటనే నియమించాలని తెలంగాణ ఏకలవ్య ఎరుకల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిని ఎరుకల జేఏసీ ప్రతినిధులు కలిశారు. ఎరుకల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేవిధంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు కురాకుల క్రిష్ణ, బుడ్డ సత్యనారాయణ, బదనపురం రఘు, శ్రీరాముల శివకుమార్, మన్సర్ సాయి, దేవ్‌సరి పాండు, బనపురం శ్రీరాములు, చర్ల రమేష్ పాల్గొన్నారు.

20న 'ఘంటసాల గంధర్వ గానామృతం'



డాక్టర్ శరత్‌చంద్ర

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఈ నెల 20వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఘంటసాల గంధర్వ గానామృతం పేరిట కచేరి నిర్వహిస్తున్నట్లు ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ అధినేత, స్వరసామ్రాట్ డాక్టర్ టి.శరత్‌చంద్ర తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో అనేకమంది గాయనీగాయకులు ఘంటసాలకు సంబంధించిన పాటలు పాడతారని తెలిపారు. అంతేకాకుండా ఈ కచేరిలో సినీ, రాజకీయ ప్రముఖులు, విద్యావేత్తలు పాల్గొంటారని చెప్పారు.

మూసీ కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలి



మూసీ సమస్యల అధ్యయన వేదిక సదస్సులో మాట్లాడుతున్న నర్సింహారావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మూసీ నదిలోని కాలుష్యనివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని పట్నం రాష్ట్ర కార్యదర్శి డీజీ నర్సింహారావు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మూసీ సమస్యల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ నది కాలుష్యం వల్ల పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు, అనారోగ్యాలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు మూసీలోకి రాకుండా నియంత్రిస్తే భూగర్భ జలాలు కూడా కలుషితం కాకుండా ఉంటాయన్నారు. సీపీఎం నగర కార్యదర్శి, పట్టణ పేదల సంఘం అధ్యక్షులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ మూసీ నదిని ప్రక్షాళన చేస్తామన్న ప్రకటనలకే గత ప్రభుత్వాలు పరిమితమయ్యాయని అన్నారు. ముఖ్యంగా మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న ఆక్రమణలు, అక్రమ కట్టడాలను తొలగించాలని, ఆక్రమణ తొలగింపు పేరుతో పేదలను భూనిర్వాసితులను చేస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.డి.అబ్బాస్, గీతకార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బాలరాజ్, రైతు సంఘం నాయకులు జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

21న మున్నూరుకాపు సంఘాల భేటీ



డాక్టర్ కొండ దేవయ్య పటేల్

కాచిగూడ: రాష్ట్రస్థాయి మున్నూరుకాపు కులసంఘాల ప్రతినిధుల సమావేశం ఈ నెల 21న ఉదయం 9 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య తెలిపారు. సోమవారం నారాయణగూడలోని సంఘ కార్యాలయంలో మీడియాతో మాట్లాడతూ 33 జిల్లాల అధ్యక్షులు, ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవిపటేల్, మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పటేల్, మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్ పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్ కుమార్, దేశెట్టి శివకుమార్, వాసాల వెంకటేశ్వర్లు, ఆకుల బాలకృష్ణ, తేళ్ల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి కాలేయమార్పిడి చికిత్సకు రూ.లక్ష సాయం



చెక్కు అందజేస్తున్న పవన్‌రెడ్డి దంపతులు

కాచిగూడ: చిన్నారి కాలేయ మార్పిడి చికిత్సకు బీజేపీ నేత బి.పవన్‌రెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన బండారు భరత్‌కుమార్ పద్మారావునగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతని మూడున్నరేళ్ళ కుమార్తె సీతాన్విత కొంతకాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతోంది. రెయిన్‌బో చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చిన్నారికి వైద్యపరీక్షలు నిర్వహించగా, చికిత్సకు రూ.22 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న బీజేపీ నేత బి.పవన్‌రెడ్డి సోమవారం భరత్‌కుమార్‌కు లక్ష రూపాయల చెక్కు అందజేసి సహాయం అందించారు. ఆ చిన్నారి పూర్తిగా కోలుకున్న తర్వాత పదో తరగతి వరకు ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పవన్‌రెడ్డి దంపతులకు భరత్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆరని తదితరులు పాల్గొన్నారు.

జితేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు



జితేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న హరినాథ్‌రెడ్డి, విజితారెడ్డి

నల్లకుంట: ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా, రాష్ట్ర ప్రభుత్వ క్రీడావ్యవహారాల సలహాదారుగా నియమితులైన జితేందర్‌రెడ్డిని సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డిల ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.గోవర్ధన్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, పండరినాథ్, శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే



దీన్‌దయాల్‌రెడ్డిని సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రతీ కార్యకర్త పార్టీకి అండగా నిలిచి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి ముషీరాబాద్‌లో ప్రజా సమస్యల పరిష్కారానికి, ఓటర్ నమోదులో కీలక పాత్ర పోషించినందుకు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముషీరాబాద్‌లోని ఆరు డివిజన్‌లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్‌స్థాయి నుంచి బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కాలేజీ హాస్టళ్ల మెస్ బిల్లులు చెల్లించాలి



ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యం తదితరులు

కాచిగూడ: బీసీ కాలేజీ హాస్టళ్ల విద్యార్థుల మెస్ బిల్లులు, అద్దెలు, కరెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంతో కలిసి ఆర్.కృష్ణయ్య సోమవారం సీఎం రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థుల, నిరుద్యోగుల సమస్యలపై నరేందర్ రెడ్డితోపాటు పలు శాఖల ప్రధాన కార్యదర్శులతో ఆర్.కృష్ణయ్య చర్చించారు. కార్యక్రమంలో బీసీ నేతలు నీల వెంకటేష్, నీరడి భూపేష్ సాగర్, టి.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహాల ప్రతిష్ఠాపనలో గోపాల్‌రావు, కన్నె ఉమా రమేష్ యాదవ్ తదితరులు

కాచిగూడ: శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో వివిధ దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కాచిగూడ హరాస్‌పెంటలోని ఆలయంలో గణపతి హోమం, సత్యనారాయణస్వామి వ్రతం, శివుడు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, నాగదేవతా తదితర దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.గోపాల్‌రావు దంపతులు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, విజయ్‌కుమార్, రాజ్‌కుమార్ విగ్, రతన్ విద్యాసాగర్, సాయి గిరిధర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగిన మత్తులోనే వృద్ధుడి హత్య!

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బాగ్‌లింగంపల్లి మీనాక్షి హోటల్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై జరిగిన వృద్ధుడి హత్య ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తాగిన మత్తులో ఉన్న ఓ వ్యక్తి ఈ దారుణానికి పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. శనివారం రాత్రి ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వృద్ధుడు హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే హత్యకు కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ఇరువురి మధ్య ఏమైనా గొడవ జరిగిందా అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. నిందితుడిని పట్టుకునే విషయంలో పోలీసులు కొంత పురోగతి సాధించినట్లు కూడా తెలిసింది. మంగళవారం నిందింతుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తారని తెలుస్తోంది.

అయోధ్యలో జాంబవంతుడి విగ్రహం ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌రాజ్

ముషీరాబాద్: అయోధ్య రామాలయంలో జాంబవంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని మాదిగ రాజ్యాధికార పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.నవీన్ రాజ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం భోలక్‌పూర్‌లోని సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు జాంబవంతుడి చరిత్ర తెలిసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ జిల్లాలో రెండెకరాలలో జాంబవంతుడి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టాలని కోరారు. ఏపీలోని నెల్లూరులో ఉన్న జాంబవంతుని దేవాలయాన్ని పునర్‌నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ రాజ్యాధికార పోరాట సమితి యువసేన రాష్ట్ర అధ్యక్షులు ఎల్లేష్, మాదిగ విద్యార్థి ఫెడరేషన్ నగర అధ్యక్షులు ప్రవీణ్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉంది.. జాగ్రత్త!



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అందరూ జాగ్రత్తలు పాటించాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య సూచించారు. కార్యక్రమాలు చేపట్టే ముందు పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎటువంటి ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు చేపట్టడానికి వీలు లేదన్నారు. కాగా, పీఎస్ పరిధిలోని పదో తరగతి పరీక్షాకేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

భగత్‌సింగ్ జీవితచరిత్రను సిలబస్‌లో చేర్చాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాత్యాయని, మహేష్ తదితరులు

ముషీరాబాద్: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు దేశానికి కేవలం అధికార మార్పిడిని కోరుకోలేదని, సమసమాజాన్ని కలగన్నారని ప్రముఖ రచయిత్రి కాత్యాయని అన్నారు. అలాంటి వీర కిషోరాల జీవితచరిత్రలను ఎన్‌సీఆర్‌టీఈ సిలబస్ కుదింపు పేరితో తొలగించడం సమంజసం కాదని, వెంటనే వాటిని పునరుద్ధరించాలని అన్నారు. (పీడీఎస్‌యూ, పీవైఎల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గడ్డం శ్యామ్, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, గౌతమ్, ఆసిఫ్, గణేష్, చరణ్, రామాంజనేయులు, సాయికృష్ణ, గణేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కూల్చిన చోటే ఇళ్లు నిర్మించాలని నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న వివేకానందనగర్ బాధితులు

చిక్కడపల్లి: స్వామి వివేకానందనగర్‌లో తమ ఇళ్లు కూల్చివేసి 50 రోజులు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదని బస్తీవాసులు నిరసన చేపట్టారు. ఇళ్లు కూల్చిన చోటే తమకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం రాత్రి కూల్చివేసిన ఇళ్లస్థలంలోనే కొవ్వొత్తులను వెలిగించిన నిరసన తెలిపారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు ఎంబీ కృష్ణ, నరేశ్, గణేశ్, ఆనంద్‌రావు, వసంత్, సాయిరామ్, సువర్ణ, సునీత, ఇందు, భాగ్యలక్ష్మి, పూజ, రేఖ, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ధర్నా



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న చింతల రాజలింగం, బానాల మంగేష్ తదితరులు

కవాడిగూడ: మాదిగలతో సంబంధం లేకుండా ఎస్సీలోని 57 ఉపకులాలకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎస్సీ 57 ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల రాజలింగం, ప్రధాన కార్యదర్శి బానాల మంగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేవెళ్ల డిక్లరేషన్ అమలు చేస్తూ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీలకు ఎలాంటి అవకాశాలు వచ్చినా మాల, మాదిగలు మాత్రమే లబ్ధిపొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు మేడి పాపయ్య మాదిగ, ఐక్యవేదిక ఉపాధ్యక్షులు ఏర్పుల యాదయ్య, వివిధ ఉపకులాల సంఘాల నాయకులు గోనె రాజు, ఎం.సాయిలు, ఎస్.విఠల్, ముత్యాలు, బాలకృష్ణ, గోపాల్, రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

'సివిల్స్'పై అవగాహన



మాట్లాడుతున్న కృష్ణప్రదీప్

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో పాలన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సివిల్ సర్వీస్ పరీక్షలకు ఎలా తర్ఫీదు పొందాలనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య అధ్యక్షత వహించగా 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ కృష్ణప్రదీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఏ సబ్జెక్టులలో అవగాహన కలిగి ఉండటం వల్ల సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించవచ్చో వివరించారు. ప్రతి విద్యార్థి లక్ష్యం సాధించడానికి రోజుకు 12–16 గంటలు చదవాలని సూచించారు. డాక్టర్ సుకన్య మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కృష్ణప్రదీప్‌ను కోరగా ఆయన అంగీకరించారు. ఈ కార్యక్రమంలో పాలన శాస్త్ర విభాగం అధ్యాపకులు తిరుపతి, చరిత్ర అధ్యాపకులు పి.వెంకట ఈశ్వర్, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు ఎ.కవిత, బంగ్లా భారతీ, డాక్టర్ అవినాష్, జె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కవిత్వం కదిలించేదిగా ఉండాలి: మౌమిత



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న మౌమిత ఆలం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కవి సమ్మేళనం సభికులను ఆకట్టుకునేలా సాగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ప్రముఖ బెంగాల్ రచయిత్రి మౌమిత ఆలం మాట్లాడుతూ కవిత్వం కదిలించేదిగా ఉండాలన్నారు. జరుగుతున్న సంఘటనలను ఆధారంగా కవిత్వాలు రాస్తే ప్రజల్లో మంచి స్పందన వస్తుందన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కవిత్వం దోహదపడుతుందని ఆమె చెప్పారు. ఏబుషి నర్సింహ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిథిగా కె.ఆనందాచారి, వంశీకృష్ణ, రామకృష్ణ, చంద్రమౌళి, మేరేటి రేఖ తదితరులు పాల్గొన్నారు.

మాతృమూర్తులను గౌరవించుకోవాలి



సత్యవాణి సన్మానిస్తున్న ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి

చిక్కడపల్లి: మాతృమూర్తులను గౌరవించుకోవాలని రచయిత, ఆధ్యాత్మకవేత్త భారతీయం సత్యవాణి అన్నారు. సోమవారం రాత్రి గీతా ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో పలువురు ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం సత్యవాణిని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి సన్మానించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షురాలు గీత అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖులు కోలేటి దామోదరగుప్తా, దైవజ్ఞ శర్మ, డాక్టర్ జయంతిరెడ్డి, గాయని ఆమని, సుధారాణి, బేబి తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రీయపద్ధతులు పాటించాలి: సాగర్



సమావేశంలో మాట్లాడుతున్న సాగర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అశాస్త్రీయ భావజాలం నుంచి శాస్త్రీయ పద్ధతుల వైపు రైతులు పయనించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ గ్రౌండ్ వాటర్ డివైనర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతుల్లో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రైతులకు నీరు అందించాలని కోరారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రౌండ్ వాటర్ డివైనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చంద్రమౌళిగుప్తా, అధ్యక్షులుగా కలింగ హరికృష్ణ, ప్రధానకార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యాదగిరి, టి.మాధవ్, మధుసూదన్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా వీరయ్య, పి.స్వామి, శ్రీను, గౌరవ సలహాదారులుగా ప్రశాంత్, మూడ్ శోభన్‌నాయక్, కోట రమేశ్ ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



కమ్యూనిటీహాల్‌ను పరిశీలిస్తున్న పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అన్ని అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి వహిస్తామని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. మెరుగైన వసతులతో జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ అభివృద్ధి చేస్తామని చెప్పారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు అబ్దుల్ సలామ్, మహేష్, ఎస్ఆర్‌టి , జవహర్‌నగర్ వ్యాయామశాల, ఆట స్థలం, కల్యాణ మండపం పరిరక్షణ కమిటీసభ్యులతో కలసి కమ్యూనిటీహాల్‌ను సందర్శించారు. కమ్యూనిటీహాల్‌లోని రెండు అంతస్తులకు నూతన కరెంట్ వైరింగ్, మరుగుదొడ్డి రిపేర్, నల్లాల ఏర్పాటు కలరింగ్ పనులు, నూతన గేట్ తోపాటు పలు ఏర్పాట్లకు సంబంధించిన నివేదికను ఇదివరకే జోనల్ కమిషనర్‌కు అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, నాయకులు ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, పరిరక్షణ కమిటీ సభ్యులు ఎన్.మల్లేష్, మారిశెట్టి నర్సింగ్‌రావు, జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్: తెలంగాణ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ వీర్ల ఐలయ్య అన్నారు. సోమవారం బీసీ సాధికారత భవన్‌లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రెంక రవి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల ఐలయ్యను యూనియన్ గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. అద్దె బస్సు డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె బస్సులు నడిపే డ్రైవర్లకు ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. 15 ఏళ్లుగా ఆర్టీసీలో డ్రైవర్లుగా పనిచేస్తున్నా రని వారికి బస్‌పాస్ సౌకర్యం కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం..సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది డ్రైవర్లను ప్రభుత్వం నియమించే ఆర్టీసీ నియమకాలలో డ్రైవర్లకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.